# ప్రేమకు శిక్ష

చెరకురసం తెచ్చి గూనలో పోసి ఆ ఖాళీ బకెట్‌తో నుంచున్నాడు చిన్నోడు. బెల్లం వండుతున్న పొయ్యి దగ్గర మంట కాగుతున్నాడు జగ్గన్న. సెగ వెచ్చగా వంటికి పట్టున్నది. నిద్ర మత్తుకి కళ్లు బరువుగా పడిపోతున్నాయి. ఇన్నావురా అని జగ్గన్న అడిగితే — దేన్ని గురించో చిన్నోడికి అర్థం కాలేదు. జగ్గన్న కళ్లల్లోకి చూస్తూ నుంచున్నాడు.

చాలాసేపు ఊపిరి కూడదీసుకుంటున్నట్టుగా పెదవి కదపకుండా కూర్చున్న తర్వాత, 'ఆ గుంట సచ్చిపోతాద్రా. అది మరి బతకదు. మంకుపట్టు పట్టేసింది. ఏడిసేడిసి సగమయిపోయింది. అదింక బతకదురా సిన్నోడా, సచ్చిపోతాది' నోటిలో చుట్ట తీసి, పొగ వదులుతూ నెమ్మదిగా అన్నాడు జగ్గన్న. ఎర్రటి మంట జగ్గన్న ముడతల ముఖం మీద, నెరుస్తున్న జుత్తుమీద కెరటాల్లాగ పడుతున్నది.

'చిన్నోడా, చెరుకు మోపెయ్యిరో.' మెషిన్ దగ్గర కూర్చుని చెరకుగడలను మెషిన్‌లోకి కుడుపుతున్న జంగమయ్య అరిచాడు.

చిన్నోడు బకెట్ అక్కడ ఉంచేసి, పందిరికి ఉత్తరగా పడున్న చెరకు మోపుని తెచ్చి మెషిన్ దగ్గరవేసి, మళ్లీ బెల్లంపొయ్యి దగ్గరకు వచ్చి నుంచున్నాడు.

పొయ్యిలోకి చెరకు తొక్కువేస్తున్న చొట్టోడికి జగ్గన్న ఏం చెపుతున్నాడో వినిపించలేదు. వాడు పందిరి బయట దక్షిణంపక్క కూర్చున్నాడు. పందిరి తడిక సందుల్లోంచి జగ్గన్న అయితే కనిపిస్తున్నాడు కాని మాట సరిగ్గా వినిపించటం లేదు.

"మా గనమయిన అల్లుడిని సేసినాడు — పెళ్లి, ముందు ఎనకా ఆలోసించకుండా. ఆ అల్లుడు గుంటడికి వాయీ వరసా ఉన్నాయిరా. సిన్నా పెద్దా ఉన్నాదిరా. ఆడితో ఏ గుంటయినా కాపరం సేయగలుగుతాదిరా. ఆడికున్న రోగాల్తో ఆడు సవ్వటం సంగతటుంచు బంగారంలాంటి పిల్ల ఇదెన్నాళ్లు పేణంతో బతుకుతాదంటావ్? ఊళ్లో ఉన్న లంజకొడుకు యీడికే కళ్లు కనబడలేదు. పొరుగూరోడికి యింకేం కనబడతాది.? అయినా డబ్బు మాయున్నాది సూడూ —దాని ముందు ఈ పెపంచకంల యింకేం కనబడవురా సిన్నోడా. నరసయ్య కళ్లకి ఆ డబ్బు మసకలు కప్పేసింది. పెద్దింటోడు. ఒక్కడే కొడుకు. ఆడి పొలాలు, ఆడి ఆస్తి, ఆడి మేడిల్లు, ఆడి ఇంట్లోని బంగారం సరుకులు, ఆడి డబ్బు, ఆడి యాపారం... అయే కనబడినాయి. మరింకేవీ కనబడ్లేదు. మంచీ సెడ్డా కనబడ్లేదు. పరువూ పెతిష్టా కనబడ్లేదు. డబ్బుమాయ కళ్లకి పొరలు కప్పేసింది. ఆ గుంట — బంగారు బొమ్మలాంటి గుంట —బతుకు బుగ్గయి పోయింది.' జగ్గన్న నొచ్చుకున్నాడు.

అన్నం తింటానికి ఇంటికి వెళ్లినప్పుడు జగ్గన్న సుభద్రని చూశాడు. మూడునాలుగు దినాలవుతున్నది ఆ పిల్ల తిండి తినకుండా బల్లిలాగ మంచానికి అంటుకుని పడుకుని. ఆ పిల్లని చూసొచ్చిన బాధ ఇంకా వెంటాడుతున్నది. ఆ పెళ్లిమాట వచ్చినప్పుడే జగ్గన్న బాధపడ్డాడు. డబ్బుకోసం గడ్డితినకురా అని చెప్పాడు నర్సయ్యతో. నర్సయ్య విన్లేదు.

పొయిలో మంట తగ్గటం చూశాడు చిన్నోడు. 'అయిందిరా పనీ. ఓర్ చొట్టోడా... తొక్కెయ్యిరో' విసుక్కుని అరిచాడు.

చొట్టోడుకి ఒకకాలు ఊచకాలు. ఆడు కూర్చుని ఎంతపనయినా ఎంత సేపయినా చేయగలడు. రాత్రంతా బెల్లం వంట. పొయ్యిలోకి ఆపకుండా తొక్కెయ్యాలి. పగలు ఎండలో పని సాగదు. అంచేత రాతిరంతా గానుగపని సాగుతుంది. బయట ఎడ్లు గానుగ తిరుగుతున్నాయి. మెషిన్‌లోకి జంగమయ్య చెరకు కుదుపుతున్నాడు. ధారగా చెరకు రసం కింద గోతిలో పెట్టిన బకెట్‌లో పడుతున్నది. మెషిన్ కిర్రూ కిర్రూ

రాగాలు తీస్తున్నది. ఎడ్లు తోలుతున్న పద్నాలుగేళ్ల దాసుకి జగ్గన్న తాత గొంతు వినిపించింది. అక్క ఒక రోజున 'నాకా పెళ్లి సెయ్యటం కన్న ఉరిపోసి సంపేస్తే నీకు పున్నెంరా అయ్యా' అని ఏడ్చింది. ఆ మాటలు దాసుకు గుర్తొచ్చాయి. అయ్య —అక్కను కొట్తుంటే ఏడుపొచ్చింది. ఇంకొంచెం పెద్దవాడయితే అయ్యని పట్టుకుని కొట్టాలి అనిపించింది. అమ్మ నోరుమూసు కుంటుంది. దానికీ భయమే. తను చదువు కోవాలంటే, వొద్దురా మనకా చదువులబ్బవురా అని చదువు మాన్పించి వ్యవసాయంలో పెట్టాడు తండ్రి. అన్నీ గుర్తుతెచ్చుకుని ఎడ్లవెనక నడుస్తున్నాడు దాసు.

జగ్గన్న చెప్పిందంతా చిన్నోడు ముందే విన్నాడు. చిన్నోడికి సుభద్ర అంటే ఆ ఇంట్లో మనుషులందరికంటె ఇష్టం. నర్సయ్య కంబారిగా వాడు పద్నాలుగో ఏట చేరాడు. పదేళ్లు గడిచాయి. ఇంకా ఆ పిల్లకి కంబారోణ్ణి దూరంగా చూడాలనే బుద్ధిరాలేదు. చిన్నన్నా చిన్నన్నా అంటుంది. అలా కంబారోణ్ణి ఎవరూ పిలవరు. దాని ఇష్టం లేకుండా పెళ్లిచేసినప్పుడే చిన్నోడు బాధపడ్డాడు. అందరూ అనుకున్నట్టే ఆ పిల్లకి — పెద్దింటివాళ్లబ్బాయి తగినోడు కాదని అనుకున్నాడు. ఇప్పుడు జగ్గన్న ఈ మాట చెప్పిన తర్వాత ఆ పెద్దింటి సంపదకి నర్సయ్య కక్కుర్తిపడ్డాడనిపించింది.

'అంతా అయిపోన్దానికి ఇప్పుడేం చేయాల్తాతా — ఇకన మనసు మెత్తన సేసుకోవాల్తప్ప. ఆ మూడు ముళ్లూ పడకముందయితే —'

సుభద్ర మూణ్నాల్నించి తిండితిన్లేదని వింటున్నాడు. ఆ పిల్ల మనసు ఎవరెన్ని చెప్పికూడా మార్చలేక పోయారు. ఆడంబరంగాచేసిన పెళ్లి ముగిసేసరికి అందరిమొఖాలు బిగుసుకు పోయాయే కాని విచ్చుకోలేదు. పొరుగూర్లనించి వచ్చిన మేనత్తలూ, బంధువులూ నాలుగయిదు దినాలు ఉండాల్సినవాళ్లు ఒకటి రెండ్రోజుల్లోనే తిరుగు ప్రయాణం కట్టారు.

'కాలం మారిపోయింద్రా సిన్నోడా, మనుషులు మారిపోయినార్రా,' అని చుట్ట మరొక దమ్ము పీల్చాడు జగ్గన్న. 'ఈ రోజులకి ఆ రోజులకి ఎంత ఎత్తేసం. అప్పుడీ డబ్బాలేదు. యీ కక్కుర్తీలేదు. ఎఁవిటో ఈ డబ్బా యిలాఁగ పెరిగి పోతున్నాది. దానెనకపడి మనుసులుకూడా సెడిపోతున్నారు. ఈ నర్సయ్యగాడికి ఏఁవిటి లోటయిందన్నా — కూతుర్ని ఆ పెద్దింటోళికివ్వాల. మనిసి మంచీ, బతుకు మంచీ సూడకుండా. సిన్నోడా ఇను, ఈరబ్రెమ్మం సెప్పిందంతా జరిగే తీరుతాద్రా. ఏదీకాకుండాపోదురా. ఆడదాయి రాజ్జెం ఏల్తదన్నాడు. ఏల్తన్నాది. అరిజనులు కోవిల్లో పూజ సేస్తారన్నాడు. సేస్తన్నారు. వాయీ వరసలు పోతాయన్నాడు. పోతన్నాయి.

నాయినా, నేనయితే పెద్దకాలమోడిని. లావుకాలం బతకను. నీవు చిన్నోడివి. నాలుక్కాలాలు బతుకుతావు. నీ కళ్లతో ఈ లోకం తీరంతా సూస్తావు. అప్పుడు నా మాట మతిలేసుకుంటావు. మా సిన్నప్పుడు యీ సిన్మాలెరుగుదుమా? ఈ రైలుబళ్లున్నాయా? ఈ ఇమానాలు సూసినామా! ఈ వోట్లు గొడవ మాకు తెలుసునా —ఇదంతా ఏమవుతాదో".

జగ్గన్న ఎవరివేపూ చూడకుండానే నిద్రమత్తుకి కళ్లు మూతలుపడుతుంటే మనసులోని మాటలు చెబుతున్నాడు. అప్పుడప్పుడు మాటల మధ్యలో గొంతు రెండు మూడు స్వరాలుగా చీలిపోతున్నది.

జగ్గన్న చెప్పిన వీరబ్రహ్మం సూక్తులు అర్థమయినట్టు పందిరి బయట నించి చొట్టోడు 'కాకితాలొచ్చినాయి, ఎండి రూపాయి లెగిరిపోయినాయి. కాకితాలు కాకితాల్లాఁగే ఉన్నాయి. కడుపుమంట కడుపు మంటలాఁగే ఉన్నాది.' వాడి పాట వాడు పాడాడు. 'లోకం జగ్గన్న తాతా, లోకం' అన్నాడు పిచ్చి నవ్వుతో చొట్టోడు.

చెరకుగానుగ తిరుగుతున్నది. ఎడ్లను అదురుతున్నాడు పధ్నాలుగేళ్ల దాసు. మెషిన్ కిర్రూ కిర్రూ రాగాలు తీస్తున్నది. చలి మెల్లగా విజృంభించింది.

'చెరకు మోపెయ్యిరో' జంగమయ్య అరిచాడు మెషిన్ దగ్గర్నించి.

* * *

టార్చిలైట్ వెలుగులో నడుస్తూ వచ్చాడు నర్సయ్య. ఒకసారి పందిరి కింద అన్నీ వెతికి చూశాడు. మెషిన్ దగ్గర కూర్చున్న జంగమయ్య పచ్చి దొంగ. ఆడు సందు దొరికితే ఏదో ఒకటి మాయం చేస్తాడు. ఈ జగ్గన్న ఇంటిమనిషి అనుకుంటే కూర్చున్నకాడ కునికిపోతాడు. ఆ చిన్నోడు ఎద్దు. ఎద్దులాగ పనిచేస్తాడేకాని బుర్రలేదు. ఎక్కడ ఏ వస్తువుపోయినా ఆడికి తెలీదు. ఇక చొట్టోడంటే ఆడి బుర్ర గట్టిదేకాని టక్కరి. ఇలాంటి మనుషుల్తో నర్సయ్య తన వ్యవసాయం పనులు చేయించుకోవాలి. అందుకే నర్సయ్య గిరకసాల విడవడు. తిని రావటానికి ఇంటికి అరగంట కిందట వెళ్లాడేకాని అతడి మనసంతా ఇక్కడే ఉంది.

తూర్పుకి ఎదురుచేసి గిరకసాల పందిరి. మూడువేపులా ఆకుల్తో కొమ్మల్తో తడికిల గోడలు. పందిరి పైనాఆకులూ కొమ్మలూ కప్పారు. ఆ పందిరిలో ఒక పక్క కొత్త బెల్లంకుండలు జేగురురంగుతో, ఏభై అరవైకి పైగా ఉన్నాయి. బెల్లం నింపిన తరిగూనలు. ఒక పక్కమంచం. పందిరికి తూర్పున మనిషిలోతున పెద్ద నుయ్యి సైజు పొయ్యి. ఆ పొయ్యికి తగినట్టు పెద్ద పెనం. పొయ్యికి దగ్గర్లోనే చెరకు పానకం నిలవ

ఉంచే రొమ్మెత్తు పెద్దగూనలు. ఇంకా చాపలు, దుప్పట్లు, గడ్డీ, పెట్రొమాక్స్ లైట్ వెలుతురు. అదీ గిరకసాల.

బెల్లంవంట ఇంకా పదిహేనుదినాలు సాగుతుంది. అంతవరకు ఆ పందిరే నర్సయ్యకీ పనివాళ్లకీ అదే ఇల్లు.

నర్సయ్య మంచం మీద కూర్చున్నాడు.

దాసు చేతిలోని కర్రందుకుని ఎడ్లను అదురుతున్నాడు చిన్నోడు. దాసు ఇంటివేపు పోతుంటే నర్సయ్య పిలిచాడు. 'ఇంటికాడ మందు మాత్రలు ఏసుకోవటం మరిసిపోయినాను. రంగయ్యతో పంపు నాయనా' అని కొడుకుతో చెప్పి పంపాడు.

కూతురు పెళ్లిచేసిన కాడినించి నర్సయ్య మనసుకి శాంతి లేకుండా పోయింది. రెండెకరాల పల్లపు భూమి కొన్నాడు. ఆ భూమి రిజిస్ట్రేషన్ చేసుకోటానిక్కూడా తీరిక చిక్కదు. బెల్లం పని దగ్గర ఉండకపోతే ఇదేమయిపోతుందో అన్న అనుమానం. అన్నిటికీ ఒంటరివాడు. కూతురుకు పెద్దింటి సంబంధం చేసిన సంతోషం లేకుండాపోయింది. 'ఏ నూతిలోనో గోతిలోనో పడిచస్తాను గాని బతకన్రా అయ్యా. ఆ మేడల్లో నేను బతకన్రా. నా బతుకు బుగ్గి సేసినావురా అయ్యా' అని ఏడ్చింది. కూతురు ఏడుపు మనసుకు చీడపురుగులా పట్టింది.

'సుబ్బులు తిన్నాదా?' జగ్గన్న కళ్లు మూసికొనే, ఓ పక్క నిద్దర కుమ్ముకొస్తుంటే అడిగాడు నర్సయ్యని.

మాట పెకల్లేదు. జగ్గన్న అంటే నర్సయ్యకి బెరుకు ఉంది. ఈ పెళ్లి చేస్తున్న కబురు తెలిసినప్పుడు జగ్గన్న 'ఆలోచించి మాటియ్యి' అన్నాడు. నర్సయ్య ఆలోచన వేరేదారిలో వెళ్లింది. ఊళ్లో తన పరపతి పెరుగుతుంది. పాతికేళ్లుగా రెండు కుటుంబాలకీ మధ్య ఉన్న వైరం పోతుంది. కోర్టులు, పోలీసు గొడవలు తగ్గిపోతాయి. ఈ పట్టుదలల్తో చాలా డబ్బు ఖర్చయింది. వడ్డీ వ్యాపారం మీద పెట్టిన డబ్బు వసూలవుతుంది. దానితోపాటు భూములు దక్కుతాయి. వీటితో మనశ్శాంతి ఏర్పడుతుందను కున్నాడు నర్సయ్య.

'దాని మనసు బోదపెట్టాలిగాని నీవు నరుకుతాను సంపుతాను అంటే అవుతాదిరా' అన్నాడు జగ్గన్న.

దానికేం తక్కువయింది. దానికేం తక్కువ చేసినాను. ఆస్తీ డబ్బూ పేరూ ఉన్న ఇంటికి మనువు కుదిర్చితే ఏం తప్పు చేసినానని దానికా ఏడుపు? అల్లుడు నడకంటావా — ఈ వూర్ల ఎవరున్నార్రా శ్రీరాములూ. ఆడిది బయటపడింది.

మిగిలినవాళ్లది బయటపడలేదంతే. వయసులో ఉన్నాడు. పెళ్లి కాకముందు తప్పు అడుగేస్తే —అది బతుకంతా ఉంటాదా —ఈ ధోరణిలో పోతాడే గాని కూతురు ఎక్కడ దెబ్బతిన్నదో అన్న సంగతి ఎంతకీ ఆలోచించడు. ఎంతో పోటీపడి ఈ సంబంధం ఔననిపించాడు. రకరకాల ఎత్తులూ పైఎత్తులూ ఆలోచిస్తేగాని ఇది సాధ్యం కాలేదు. ఇంత శ్రమపడిచేసిన పెళ్లిని, మొండి పట్టుదలతో కూతురు కాలదన్నుతుంటే నర్సయ్యకు కోపం వచ్చింది. ఆ కోపంలోనే ఒకటి రెండుసార్లు చెయ్యిచేసుకున్నాడు. 'చస్తాను చస్తాను అంటున్నావు. చస్తే చావు. వొల్లకాటికి తీసికెల్లి బూడిద చేసేసి సెర్లో నాలుగు మునుగులు మునిగేసి నీ రుణం తీరిపోయిందనుకుంటాము' అన్నాడు విసిగిపోయి. తర్వాత కూతురు ముఖం రెండు దినాలుగా చూడలేదు.

బెల్లం ఉడుకుతున్న తీయని వాసన. ఎడ్ల అడుగుల చప్పుడు. చెరకురసం బకెట్‌లో పడుతున్న ధార. నక్షత్రాలు నిండిన చలి ఆకాశం. మండుతున్న పొయ్యి. చెరకుతొక్కు వేస్తున్న చొట్టోడు. కూర్చునే కునుకుతున్న జగ్గన్న. ఎడ్లను అదురుతూ మధ్య మధ్య బకెట్ నిండినప్పుడు చెరకు రసం గూనల్లో పోస్తున్న చిన్నోడు. మెషిన్‌లో చెరకు కుదుపుతున్న జంగమయ్య. దూరాన అక్కడా అక్కడా గిరకసాలల సందడి. చిన్నగా నిద్ర ఊపుతుంటే మంచంమీద నడుం వాల్చాడు నర్సయ్య.

* * *

'నీకు రెండు కాళ్లూ ఉంటే లోకాన్ని మింగేసుందువురా' అన్నాడు జగ్గన్న, ఒక్క కాలుతోనే చొట్టోడు చేస్తున్న పనులకు ఆశ్చర్యపోయినట్టు. పిచ్చినవ్వు నవ్వాడు చొట్టోడు. జంగమయ్య తలనొప్పి అని, కడుపులో ఏమిటో అయిపోతున్నదని చెప్పి ఇంటికెల్లిపోయాడు. చొట్టోడు మిషన్ దగ్గర కూర్చుని పన్చేస్తున్నాడు. జగ్గన్న చెరకురసం తీసి గూనల్లో పోస్తున్నాడు.

రాత్రి దించిన చల్లారిన బెల్లాన్ని కొత్త కుండల్లో నింపుతున్నాడు నర్సయ్య. తెల్లన తెల్లవారింది. పనుల్లో దిగింతర్వాత చలికూడా పోయింది. చిన్నోడు ఎడ్లను అదురుతున్నాడు. చొట్టోడు పరాచకాలు చేస్తున్నాడు.

పరుగు పరుగున వస్తున్న నరసయ్య చిన్నకొడుకుని చూశాడు చిన్నోడు. చెరకుపొలం గట్టున వస్తున్నాడు.

'సుబ్బారావు యానికో పరిగెత్తొస్తన్నాడు' అన్నాడు.

నర్సయ్య వినిపించుకోలేదు. జగ్గన్న మాత్రం నిలబడి అటువేపు వెతికి చూశాడు. చొట్టోడు చెరుకుపిప్పి పొలంలో ఒకమూల ఎండవేస్తున్నాడు. అడ్డంగా పొలాల్లోంచి

అల్లంతదూరంలో ఊరు. ఆ దూరానికే సుబ్బారావు అలసిపోయి తిన్నగా గిరకసాల్లో అయ్యదగ్గరకు వచ్చి ఆగి ఒకసారి ఊపిరి బిగపట్టి 'అయ్యా, మరేమో అమ్మ —నీకు తీసుకొని — రమ్మన్నాది — మరేమో —సుబ్బప్ప —కనిపించలేదు' అని మధ్య మధ్య ఆగిపోతూ చెప్పాడు.

నర్సయ్య ముఖం రంగు మారిపోవటం చూశాడు జగ్గన్న.

'జగ్గన్నా' అని పిలచి 'రారా' అని కొడుకుతో ఊరువేపు నడిచాడు నర్సయ్య. చిన్నోడికి పనప్పజెప్పి నర్సయ్యతో కలిశాడు జగ్గన్న.

'చూడు సుబ్బులు ఎంతపని చేసిందో, ఇంటిలో లేదట.' అని ఏడుపుగొంతు పెట్టాడు నర్సయ్య. ఊళ్లో జనమంతా తనకోసం గుమిగూడి చూస్తున్నట్టు అయింది. కూతురు తన బతుకుని, తన పరువుని నవ్వుల పాల్చేసింది. తనకు శత్రువయింది. ఏ నూతిలో పడిందో ఏ చెర్లో పడిందో. అది పెట్టిన శోకాలన్నీ గుర్తుకొస్తున్నాయి. ఈ సంగతి దాని అత్తకీ మామకీ తెలుస్తుంది. బంధువులందరికీ తెలుస్తుంది. ఫలానా నర్సయ్య కూతురు నూతిలోపడి చచ్చిపోయిందని చెప్పుకుంటారు. ఇష్టంలేని పెళ్లి చేసినందుకు చచ్చిపోయిందని అంతా అనుకుంటారు.

వీధిలో నర్సయ్య ఇంటిముందు జనం పోగయ్యారు. ఆ మనుషుల మధ్య ఇంకా పచ్చదనం పూర్తిగా ఎండిపోని పెళ్లిపందిరి కనిపిస్తున్నది. సుభద్ర శవాన్ని తెచ్చి ఇంటిముందు వేశారేమో అనిపించింది. దాన్ని చూస్తూ జనం చుట్టు ముట్టారనిపించింది.

అప్పటికే ఊరు చుట్టూ ఉన్న నూతులూ చెరువులూ వెతకటానికి కొంతమంది వెళ్లారు.

* * *

లక్ష్మణమూర్తి టీ కాచుకుంటున్నాడు కుంపటిమీద. రేడియో వార్తలు వింటాని కొచ్చాడు జగన్నాథం. ఈజీ చేర్లో కూర్చుని ట్రాన్‌సిస్టర్‌ని ఒడిలో పెట్టుకుని ఆన్‌జేసి 'డ్రాయింగ్ మేష్టర్ ఏడీ' అని అడిగాడు.

'ఊరు వెళ్లాడండీ' అన్నాడు లక్ష్మణమూర్తి. గత ఏడే కొత్తగా వచ్చి సెకండరీ గ్రేడ్ అసిస్టెంట్‌గా హైస్కూలులో చేరాడు లక్ష్మణమూర్తి. అతడు చేరిన వారం పది దినాల్లో డ్రాయింగ్ మేష్టర్ గోపాలం ఆ స్కూల్‌లో చేరాడు. ఇద్దరూ కుర్రాళ్లు. జగన్నాథానికి కుర్రాళ్లతో తిరగటం ఇష్టం. న్యూస్‌పేపర్ రాజకీయాలు తెలిసిన డ్రాయింగ్ మేష్టర్ గోపాలంతో జగన్నాథంకి మంచి కాలక్షేపం. లక్ష్మణమూర్తిది అంతా క్రమశిక్షణ.

తెల్లారే వ్యాయామం, చలిలో చెర్లో స్నానం, దేముళ్ల ముందు ప్రార్థన, తర్వాత సొంత వంట. కనీసం సినిమాల గురించి కూడా మాట్లాడడు. వారం దినాలనించి గెడ్డం షేవ్‌చేసుకోకుండా లక్ష్మణమూర్తి కొత్తగా కనిపిస్తున్నాడు.

'ఏవిఁటి సడన్‌గా వెళ్లిపోయాడు చెప్పాచెయ్యక?'

పేరుకు తెలుగుమేష్టరే అయినా చూట్టానికి సైన్సుమేష్టర్‌లా ఉంటాడు జగన్నాథం. ధోతీ, కండువా, పొడుం డబ్బా, నూటపదకొండూ తెలుగు మేష్టరుకు తప్పనిసరి అని కుర్రటీచర్లు ఏడిపిస్తారు జగన్నాథాన్ని. మీ సరదా తీరాలంటే ఆ వేషం డీయీవో వచ్చిన రోజున వేస్తాలెండి అని వాళ్లకి తగినట్టు ఆటలాడుతాడు జగన్నాథం.

ఏం చెప్పాలో తోచలేదు లక్ష్మణమూర్తికి. జగన్నాథం గారితో చెప్పు ఈ సంగతి అని గోపాలం చెప్పాడు. కాని చెప్పటానికి ధైర్యం చాలటం లేదు. అంతేకాదు, భయంగా కూడా ఉంది. సుభద్రని తీసుకుని గోపాలం ఎక్కడికో రాత్రి పారిపోయాడు. గోపాలం చేసిన పని లక్ష్మణమూర్తికి నచ్చలేదు. తోడుగా తనని స్టేషన్ దాకా రమ్మన్నాడు. తను ఆ సహాయం చేయలేకపోయాడు. ఆ ఊరు పొలిమేరలు దాటితే రాత్రిపూట దార్లు తెలీవు. పైగా భయం. భయంతో గోపాలాన్ని ఆ పని చేయవద్దన్నాడు. ప్రమాదం సుమా అని వారించాడు. ఇంట్లో ఆ పిల్ల ఉన్నంతసేపు భయంతో లక్ష్మణమూర్తి వణికిపోయాడు. ఆ పిల్ల తెగింపుకి ఆశ్చర్యపోయాడు. లెక్కలమేష్టరు తనని ఆదుకుంటాడేమోనని అతడి సహాయం కోరి వెళ్లాడు గోపాలం. అదీ కుదరలేదు. టార్చిలైట్ చేతపట్టుకుని, ఓ చేత్తో ఆ పిల్ల చేయి పుచ్చుకుని పెరట్లో పొలాల్లోంచి దక్షిణ దిక్కుగా వాళ్లు వెళ్లిపోయారు. వాళ్లు వెళ్లిపోయినా లక్ష్మణమూర్తి భయం తగ్గలేదు. రాత్రంతా నిద్రపట్టలేదు. తెలిసి జనం వచ్చి ఇంటిముందు పడతారేమోనన్న భయంతో వాళ్లు బిక్కచచ్చిపోయారు.

ఆ మట్టిగోడల పూరిల్లు ఊరుకు పడమరగా ఉంది. కొండగాలులు తిన్నగా వచ్చి ఇంట్లో దూరుతున్నాయి. ఏడు గంటలయినా ఇంకా రొజ్జగాలి వీస్తూనే ఉంది.

లక్ష్మణమూర్తి మాటాడకముందే 'నర్సయ్య కూతురు సంగతి తెలిసిందా?' అని అడిగాడు జగన్నాథం.

'నూతులన్నీ వెతుకుతున్నారు' అన్నాడు మళ్లీ జగన్నాథమే.

చలికి అక్కడ కూర్చోలేక కుంపటి ముందుకొచ్చాడు. రేడియోలో వార్తలొస్తున్నాయి. కుంపటి వెచ్చగా ఉంది. మరుగుతున్న నీళ్లలో టీపొడి వేశాడు లక్ష్మణమూర్తి. ఆ వాసన చాలా బావుంది.

జాదవ్‌పూర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌ని నక్సలైట్లు చంపేశారు. శ్రీమతి ఇందిరాగాంధీ దేశంలోని మతవాద మితవాద శక్తుల ఉద్దేశాలని ఖండించారు. రాజభరణాల విషయంలో ఒక ఒప్పందం కుదరవచ్చునట. సామాన్య ప్రజల జీవనపరిస్థితులను మెరుగుపరచటానికి కొత్త కాంగ్రెస్ పోరాడుతుందట.

డ్రాయింగ్ మేష్టరు సంగతి జగన్నాథం మర్చిపోయి 'ఎన్నిక లెన్నికలని జనాన్ని చంపేస్తున్నారు, ఈ రాజకీయ నాయకులు' అంటూ విసుక్కున్నాడు. రేడియో వార్తల్లోని ప్రోపగండాని భరించలేకపోయాడు. అతనికి ఎలక్షన్లంటేనే కోపం. ఒకసారి ఎలక్షన్ల సందడిలో వాళ్ల తరపున ప్రచారం చేయలేదని పెద్దలు కొందరు అతణ్ణి బదిలీ చేయించారు. ఇంకోఊళ్లో ఎలక్షన్లలో నిలబడుతున్న వ్యక్తిని విమర్శించినందుకు అక్కడి వాళ్ల గ్రూపు వాళ్లు వచ్చి కొట్టారు. ఇంకోసారి వేరే పార్టీవాళ్లతో మాట్లాడినందుకు ఇల్లు ఖాళీ చేయమన్నాడు ఇంటియజమాని. హెడ్మాష్టర్ ప్రచారం చేస్తున్న మతోన్మాదాన్ని ఖండిస్తే చివరికి ఈ ఊరు పనిష్మెంట్‌గా పంపించారు. రాజకీయస్వాతంత్ర్యమన్నా, ఓటు స్వేచ్ఛన్నా జగన్నాథానికి ఇప్పుడు భయమేర్పడి పోయింది.

లక్ష్మణమూర్తి టీ ఇచ్చాడు.

రాత్రంతా ఎముకలు కొరికే చలి. ఆ చలిలో ఆ ఇద్దరూ ఎక్కడికి వెళ్లిపోయారో. దారిలో ఎలుగ్గొడ్డుల భయం. ఇద్దరికీ దారి తెలీదు. ఏమయ్యారో! తెల్లారేసరికల్లా ఊరంతా సుభద్ర నూతిలో పడిపోయిందన్న వార్త. చెర్లో స్నానం చేస్తున్నప్పుడు విన్నాడు. ఆ వార్త విని నమ్మిన జనాన్ని చూస్తుంటే లక్ష్మణ మూర్తికి మరింత భయమయింది.

టీ వెచ్చగా రుచిగా ఉంది. కుంపటి దగ్గరే తనముందే కూర్చున్న జగన్నాథంతో 'సుభద్ర చచ్చిపోలేదు.' అన్నాడు లక్ష్మణమూర్తి.

జగన్నాథం కుతూహలంగా చూశాడు.

'డ్రాయింగ్ మేష్టరూ —' అని ఆగిపోయాడు లక్ష్మణమూర్తి.

అతడిప్రక్కనున్న ట్రాన్‌సిస్టర్ డ్రాయింగ్ మేష్టర్ గోపాలంది. అది అక్కడే విడిచాడు. గోపాలం పెట్టె, బెడ్డింగ్ అన్నీ ఆ గదిలోనే ఉన్నాయి. ఏమీ తీసుకుపోలేదు. ఒక్క టార్చిలైట్ మాత్రం తీసుకుపోయాడు డ్రాయింగ్ మేష్టరు.

'భయంగా ఉందండీ. ఇది అటుతిరిగి ఇటుతిరిగి నా మీద పడుతుందేమో.'

జగన్నాథం ఆలోచనల్లో పడ్డాడు. అతడికీ అదే భయం, అదే అనుమానం కలిగింది. ఊళ్లల్లో పెద్ద మనుషుల పెత్తనాలు రుచి చూసినవాడు. ఏంచేయాలో ఏం

చెప్పాలో తోచలేదు.

ఆ ఇంటికి పడమరగా పంటకోసేసిన వరిపొలాలు! మధ్య మధ్య చెరకు తోటలు. వాటి మధ్యనించి పోతున్న వాగు. వాగు పొడవునా గట్టున చెట్లు. ఆ వెనక ఇంకా పడమరగా మామిడి తోటలు. అవి దాటితే అడవులతో నిండిన మహేంద్రగిరి కొండలవరస. అక్కడ ఆగిపోయింది జగన్నాథం చూపు.

* * *

ఊరుకు దక్షిణంగా ఉన్న అయిదారు ఇళ్లన్నీ దక్షిణంగా ఎదురుచేసి ఉన్నాయి. వాళ్ల వాకిళ్లకు అనుకునే పెద్దింటివాళ్ల చెరకుతోటలున్నాయి. ఆ చెరకుతోటల వెనకనించి వాగు వంపులు తిరిగి పోతున్నది. ఆ పక్క అంతా దట్టంగా చెట్లూ, డొంకలూ ఉన్నాయి.

నూకరాజు వాకిట్లో లేత పసుప్పచ్చని చీరలు ఎండేసినట్టుగా ఉదయం ఎండ పడింది. రొజ్జగాలిలో వాకిటకూర్చుని నూకరాజు ఇస్త్రీపెట్టెలో నిప్పు రాజేస్తున్నాడు.

నూకరాజుకి నిద్రగా ఉంది. కళ్ల మీదికి నిద్ర ముంచుకొస్తున్నది. రాత్రి నాలుగుమైళ్లు నడిచి వెళ్లి తెల్లారకముందే ఆ దారంతా నడచి వెనక్కివచ్చాడు. సుభద్ర, డ్రాయింగ్ మేష్టర్లకి తోడుగా అక్కడ స్టేషన్‌లో ఒక గంట కూర్చున్న తర్వాత రైలు వచ్చింది. నిద్రలేని అలసటతో బరువుగా ఉంది ఒళ్లు. నిద్రపోవాలని ఉంది. ఉతికిన బట్టలు మేష్టర్లవి ఉన్నాయి. అవి ఇవ్వాలి. మునసబు గారి పిల్లల బట్టలకోసం వాళ్ల కంబారి నిన్న రెండుసార్లు తిరిగాడు. అవి ఇస్త్రీ చెయ్యాలి. హెడ్మాష్టరుగారి బట్టలంటూ తెల్లారే ప్యూన్ వచ్చాడు. వీ ఎల్ డబ్ల్యు టౌన్‌కి వెళ్తాడట.

అరుగుమీద ఉతికిన బట్టల్ని చలువ చేశాడు. ఇస్త్రీ పెట్టె వేడెక్కింది. వేడి చూశాడు. మునసబుగారి షర్ట్‌తీసి ఇస్త్రీ తోముతున్నాడు.

నూకరాజుకు పెళ్లం గుర్తుకొచ్చింది. ఇంట్లో ఉండమని శారదకి చెప్పాడు. ఆ పిల్ల ఉండలేదు. అత్తతోపాటు రేవుకు వెళ్లింది.

నూకరాజు నాలుగు షర్ట్‌లు పూర్తి చేసి అయిదోది అందుకుంటుండగా చిన్నోడు వచ్చి వాకిట నుంచున్నాడు.

చిన్నోడు ఆ ఇంటిమీదినుంచి నర్సయ్య పొలాలకి పోతుంటాడు. పోతూ పోతూ నూకరాజు దగ్గర బీడీ ముట్టించుకుంటాడు. నూకరాజుతో చిన్నోడికి రకరకాల స్నేహముంది. వాళ్లిద్దరూ రెండో ఆట సినిమాకి అర్ధరాత్రులు పోయి వచ్చేవాళ్లు. ఇరుగుపొరుగు ఊళ్లల్లో జాతర్లకి కలిసిపోయేవాళ్లు. కొండకి కట్టెలకి, బొగ్గులకీ

పోయేవాళ్లు. చూట్టానికి ఒకే ఎత్తుతో ఇద్దరూ అన్నదమ్ముల్లా కనబడుతారు. ఇద్దరివీ కండరాలు తిరిగిన వొళ్లు. చిన్ననాటినుంచి ఇప్పటిదాకా స్నానాల వేళకి చెర్లో వాళ్లు రోజూ కలుస్తారు.

చిన్నోడిని చూసినప్పుడే నర్సయ్య పంపితే వచ్చాడని అనుమానం కలిగింది. నూకరాజు ముఖం ఈ రోజు కొత్తగా కనిపించింది చిన్నోడికి.

'సుబ్బులు సంగతి నీకు తెలిసిందా నూకన్నా' అడిగాడు ముందు నుంచుని పక్కకి చూస్తూ చిన్నోడు.

నూకరాజు నోరు విప్పలేదు.

'సుబ్బులు ఎక్కడికో పారిపోయింది. నీకు తెలుసునట. ఎవరో సెప్పినారు నర్సయ్యకి. ప్రెసిడెంట్ బావు, పెద్ద నాయుడు అంతా నర్సయ్యబాబు ఇంటి కాడున్నారు. నిన్ను పిలిసికొని రమ్మన్నారు' అని చిన్నోడు తను వచ్చిన పని చెప్పాడు.

నూకరాజు ఇస్త్రీపెట్టెను పక్కకు పెట్టి 'ఇంటికాడ ఎవళూ లేరుకదా - ఎలాగరాను?' అని గొణిగి పక్క ఇంటిలో చెప్పి బయల్దేరాడు చిన్నోడి వెంట.

దార్లో నూకరాజు సంగతంతా చెప్పాడు.

నూకరాజు వీధుల్లోంచి పోతున్నప్పుడు మనుషులు చూసి వాళ్లల్లో వాళ్లు మాటాడుకుంటున్నారు. వాళ్లని చూసినప్పుడు ఆ ఉదయం ఆ చలిలో చెమటలు పోశాయి నూకరాజుకు. పెద్ద మనుషులకు నిజం చెప్పాలో అబద్ధం చెప్పాలో తోచలేదు. నిజం చెప్తే ఏం చేస్తారో, అబద్ధం చెప్తే ఏమవుతుందో.

నూకరాజుకు ధైర్యం కలిగింది, మొండి ధైర్యం.

ఏం చేస్తారు. నాలుగు తిట్టారు. ఇంకా కోపమొస్తే కొడతారు. కొట్టనీ. అయినా తనేం చేశాడు. నర్సయ్య కూతుర్ని తను ఎత్తుకుపోలేదు. డ్రాయింగ్ మేష్టర్ని చూశాడు. మంచి మనిషి. పక్కనే సుభద్రని చూశాడు. ఆ పిల్ల కళ్లల్లో నీళ్లు పెట్టుకుని స్టేషన్‌దాకా రమ్మని అడిగింది. 'తోడు రారా నూకరాజూ' అని. ఆ సమయంలో మరేం గుర్తురాలేదు. వాళ్లతో బయల్దేరిపోయాడు. రైలు ఎక్కిన తర్వాత తన చేతులు రెండూ పట్టుకుని తన మేలు జీవితంలో ఎప్పుడూ మరచిపోలేమని వాళ్లు చెప్పినప్పుడు నూకరాజు చాల సంతోషించాడు.

ఇప్పుడు కొట్టారు, కొట్టనీ. కొట్టటానికి ఇదొక్కటే కారణం కానక్కర్లేదు. ఏ కారణం చెప్పన్నా కొట్టొచ్చు, చంపొచ్చు. నాయిడు చెప్పుతో కొట్టినప్పుడు, మునసబు సారాకేసులో ఇరికించి పోలీసుతో తన్నించినప్పుడు వొళ్లప్పచెప్పి నిస్సహాయంగా

ఉన్నట్టే ఇప్పుడూనూ.

నర్సయ్య ఇంటి ఎదురుగా వీధికి అటుపక్క పశువులసాల ఉంది. పశువుల్ని మేతకి తోలుకెళ్లటంతో అది ఖాళీగా ఉంది. ఎడ్లు గిరకసాల దగ్గరుండిపోయాయి. దూడలు ఆడి ఆడి అలిసిపోయి ఒక పక్క గడ్డిలో పడుకున్నాయి.

నూకరాజు వచ్చేసరికి నర్సయ్య ఇంటిముందు జనం ఎవ్వరూ లేరు. అరుగుమీద నలుగురయిదుగురు పెద్ద మనుషులు, పంచన ఇద్దరు కుర్రాళ్లు మాత్రం ఉన్నారు. ఆ పెద్దమనుషులు వచ్చేసరికి అక్కడ పోగయిన మనుషులంతా ఒక్కరొక్కరే అక్కణ్ణించి జారుకున్నారు. అంతా ముందే అనుకున్నట్టుగా నూకరాజు వచ్చీరావటంతోనే ఆ ఇద్దరు కుర్రాళ్లూ వాడిని సాలలోని రాట దగ్గరికి తీసుకుని వెళ్లారు. నూకరాజుని వాళ్లు తీసుకుపోవటమే చూశాడు చిన్నోడు. అక్కడ నిలబడలేకపోయాడు. పోబోయాడు. నర్సయ్య పిలిచి ఉండమన్నాడు. నర్సయ్యమాట వినిపించు కోలేదు. తర్వాత చిన్నోడికి నూకరాజు అరుపులు వినిపించాయి. చిన్నోడికి ఆ సమయంలో అక్కడున్న పెద్ద మనుషులందర్నీ ఒక పెద్దగొయ్యితీసి దాంట్లో పాతేయాలనిపించింది.

పెద్దనాయిడు ఇంకా అక్కడ అరుస్తున్నాడు. 'ఎంతమంది ఆడపిల్లల్ని పట్నాల్లో అమ్ముతావురా? ఎంతమంది కూతుళ్లని రైలెక్కించొస్తావురా? లంజకొడకా ఆ పిల్ల నెక్కడ దాసినావో సెప్పురా. ఆ పిల్ల నేంచేసినావో సెప్పురా. ఆ పిల్ల ఏమయిపోయిందో సెప్పవేఁమిరా?' అని అలిసిపోతున్నాడు. ముందు మాటాడకుండా దొరికిన దగ్గరల్లా కొట్టాడు. ఆ కోపంలో కర్రతో పక్క ఎముకల్లో పొడిచాడు. అరుస్తుంటే నోటిలో కర్రపెట్టి గొంతులో పొడిచాడు. పెద్దనాయిడుకి తల తీసేసినట్టుంది కోడలు పారిపోయిన వార్త. దాన్ని కప్పిపుచ్చటానికి తన పరువు కాపాడుకోటానికి వాడి వొళ్లు వొలిచేయటం కంటే ఇంకోదారి కనిపించలేదు. అప్పటికి మూలిగి మూలిగి నూకరాజు తల వేలాడిపోయింది.

* * *

శారదని చూట్టానికి వచ్చినట్టుగా అక్కడ ఆగిపోయింది వాగు. ఆ వాగులో కొచ్చి దాక్కుని తెల్లనిమేఘమూ, నీలంఆకాశమూ శారద కళ్లను చూస్తున్నాయి. వాగుగట్టున చెట్లూ, తీగెలూ, పూలూ, గడ్డీ శారద కోసం రాగాలు తీస్తున్నాయి.

శారద అత్తవారింటికి కాపురానికొచ్చి ఇంకా పదిహేను దినాలు కాలేదు. ఇప్పుడిప్పుడే శారద ఈ ఊరు గాలికీ ఎండకీ పొలాలకీ వాగులో నీళ్లకీ చెట్లకీ చేలకీ అలవాటు పడుతున్నది. ఇప్పుడిప్పుడే శారద నూకరాజు చూపుల అల్లరికీ మాటల

బాసలకీ వొంటివాసనలకీ వెలుతురొచ్చి మేల్కొల్పిన జగంలా మేల్కొంటున్నది. ఇప్పుడిప్పుడే శారద తల్లినీ తండ్రినీ, కన్న ఇంటినీ, అక్కడి మనుషుల్నీ, తనని పెంచి పెద్ద చేసిన గతాన్నీ మరచిపోతున్నది. ఇప్పుడిప్పుడే బతుకంటే శారదకి చాలా ఇష్టమవుతున్నది. ఇప్పుడిప్పుడే శారదకి మనుషు లంటే నమ్మకమేర్పడుతున్నది.

కూతురుని అత్తవారు తీసుకుపోతే తనకి తోడెవరూలేరని శారదని తెచ్చింది నూకరాజు తల్లి. ఆ పక్కన ఇంకో రెండు రేవులు. అక్కడా మనుషులు. స్నానాల రేవులవి. చుట్టూ కొండలు, పచ్చగా దట్టంగా. అయినా అక్కడ మనుషుల్లేని లోకంలా ఉంది.

అత్త అందించే ఉతికిన బట్టల్ని అందుకుని వడ్డున ఎండలో వేస్తున్నది శారద. ఆ సమయంలో నూకరాజు సంగతి తెలిసింది శారదకి.

ఎక్కడిపని అక్కడే వదిలేసి నూకరాజు తల్లి నా కొడుకో నా కొడుకో అని ఏడుస్తూ పరుగెత్తింది. చిన్నపిల్ల కోడలు భయపడిపోతుందన్న ఆలోచన కూడా లేకుండా ఏడుస్తున్నది. అత్త వెనక శారద పరుగెత్తింది. ఆ వెనక అదే రేవులో బట్టలు ఉతుకుతున్న ఆడవాళ్లు ఒకరిద్దరు పరుగెత్తారు. నా కొడుకును చంపేయకు దేముడో, నా కొడుకును రక్షించు దేముడో అని ఏడుచుకుంటూ ఆ తల్లి నర్సయ్య ఇల్లు చేరింది. అప్పటికక్కడ జనం నిండా గుమిగూడారు. ఊళ్లోని పెద్దలూ పిల్లలూ వచ్చారు.

సాల్లో రాటకి కట్టేసిన కొడుకును చూసింది. కొడుకు దగ్గరకు వెళ్లలేదు. వాకిట నర్సయ్యని చూసింది. నర్సయ్య కాళ్లమీద పడిపోయింది. నాయినా నీవు బగమంతుడవు. నాయినా నీవు పరుమాత్తుముడవు. నాయినా నా కొడుకును రక్షించు.

'ఇంకెక్కడ నూకరాజు' అని ఎవరో గొణిగారు.

అయినా ఆ మాట తల్లి చెవుల్లో పడలేదు.

అక్కడ గుమిగూడిన జగన్నాధం ఆలోచనల్లో పడ్డాడు, ఇది హింసా, అహింసా అని. ఇంతమంది ఉండి ఒక్కడూ నోరెత్తడేమని ఇంకో మేష్టరు ఆశ్చర్యపోతున్నాడు. ఈ పెద్దలంతా ఇప్పుడేం చేస్తారు అని లక్ష్మణమూర్తి అడుగుతున్నాడు. ఆ ప్రశ్నవిని డ్రిల్లుమాష్టరు —నూతిలోపడి ఆత్మహత్య చేసుకుని చచ్చిపోయాడని శవపంచాయతీలో రాసేసి శవాన్ని కాల్చుకోటానికి ఇచ్చేస్తారంటున్నాడు. ఆడి కోడలు నూతిలోపడి చచ్చిందన్నారు. అది నిజంగా చస్తే ఎవళ్లని చంపేవాడో ఈ పెద్దనాయిడు. డబ్బుకు ఆశపడి సవాలక్ష రోగాల అలుణ్ణి సేసినాడు. ఆ రోగాలతో అది సస్తే —ఎవళ్లని సంపేవాళ్లో ఈ పెద్దమనుషులు. ఆ పిల్ల చావకుండా బతికిపోయిందని ఈ

లంజకొడుకు నూకరాజుని బాదిబాది పక్క ఎముకలు ఇరగబొడిసి గొంతులో కర్రతో పొడిసి చంపాడు. పండనీ, పండనీ, పాపాలన్నీ పండనీ. పూర్తిగా పండితేనేగాని పండు రాలదని మరొక మనిషి దుఃఖానికి బదులు కసిగా అంటున్నాడు.

అయినా ఆ తల్లికి అర్థం కాలేదు.

అక్కడ అందరు మనుషుల మధ్యకి శారద వచ్చింది. కరిగిపోతున్న నీడల్లా ఉన్నారు ఆ మనుషులు. అందరూ అలుక్కుపోతున్నారు. వాళ్లల్లో మొగుణ్ణి వెతికింది. ఎక్కడా కనిపించలేదు. కళ్లు తుడుచుకుంటున్నా కన్నీళ్లు పొంగివచ్చి వెలుగంతా అలుక్కుపోతున్నది. లోకమంతా చివికిపోతున్నది. చివరికి రాట దగ్గర చూసింది. గుర్తుపట్టలేకపోయింది. నెత్తురు చారల రంగుచూసి జడిసిపోయి కెవ్వున కేకేసి అక్కణ్ణించి ఆగకుండా అటు తూర్పుదిక్కు పరుగుతీసింది. కిరాతకులు తరుముకొస్తున్నట్టు పొలాల్లోంచి, గట్లమీంచి, ముళ్లుగుచ్చు కుంటున్నా, జారిపడిపోతున్నా ఆగక పరిగెత్తింది, తన అమ్మా, అయ్యా దగ్గరికి. తన అన్నా తమ్ముళ్ల దగ్గరికి. తన తోడూ నీడా దగ్గరికి. తన బంధువుల దగ్గరికి. తన బలగం దగ్గరికి. తళతళ మెరిసే కత్తులు పట్టుకుని, శూలాలు పట్టుకుని, బల్లేలు పట్టుకుని, బాణాలు పట్టుకుని, తిరిగి ఆ ఊరొచ్చి తన మొగుణ్ణి కాపాడుకోవాలని.

* * *

మునసబు తమ్ముడు ఫస్టుక్లాసు మేజిస్ట్రేట్‌గా ఉంటున్నాడట. అక్కడికి ఒక మనిషిని పంపించారు పెద్ద మనుషులు. పెద్దనాయిడు అక్క కొడుకు సర్కిల్ ఇన్‌స్పెక్టర్. అక్కడికొక కబురెళ్లింది. నర్సయ్య బావమరిది అడ్వొకేటు. ఒక మనిషిని అటు పంపించారు. ఎమ్మెల్యేని తీసుకుని స్వయంగా సర్పంచి బయల్దేరాడు.

సాక్షులు మాత్రం ఇంటికిపోయి నూకరాజుని గుర్తుతెచ్చుకుని, శారదను గుర్తుతెచ్చుకుని, నూకరాజు తల్లిని గుర్తు తెచ్చుకుని ఆ పూటకి తిళ్లు తినలేకపోయారు.

* * *

'యువ'

*దీపావళి ప్రత్యేక సంచిక 72*